# రైళ్ళు - రైళ్ళు

ప్రమాదవశాత్తు నిప్పులో కాలిన దుంపకీ, దుప్పికీ ఉప్పు తగిలించి రుచి మరిగిన తొలి మానవులు నిప్పు ఉపయోగం తెలుసుకొని, బండరాళ్ళని తరలించడానికి గుండ్రటి చెట్ల మానుల్ని ఉపయోగించి, తద్వారా చక్రాన్ని తయారు చేసీ, నాగరికతకు నాందీ ప్రస్తావనలు చేశారు.

లోకసంరక్షకుడు శ్రీహరి చక్రం దుష్టసంహారం నిమిత్తం ఎన్నిసార్లు నియోగించబడిందో తెలియదు కాని, మానవ నిర్మితమైన చక్రం ప్రగతిపథ నిర్మాణంలో అనన్య సామాన్యమైన పాత్ర వహించింది. ప్రయాణ సమయాన్ని ప్రమాణంగా తీసుకొని దూరాన్ని కాలంలో కొలుస్తే, వాహనాలు, దేశాల్ని దగ్గర చేశాయి. ప్రపంచాన్నే కుచించిన ప్రయాణాలు మానవుడి జీవితంలో నిత్య భాగమై కూర్చున్నాయి. ఎందుకూ అంటే మూల కారణం పొట్ట కూటికి. ఆ తర్వాత చెప్పగల కారణం 'ఏదో పని' మీద.

మా కంపెనీకి కావల్సిన 'రేడియో యాక్టివ్ ఐసోటోప్'ల సరఫరా విషయమై అణుశక్తి కేంద్రంతో సంప్రదింపులు జరపడానికి చాలా సంవత్సరాల క్రితం – అంటే 1965 ప్రాంతాల్లో, అస్సాం నుంచి బొంబాయి వెళ్ళడం తటస్థించింది. సంప్రదింపులు పూర్తి చేసి పనైపోయిన తర్వాత, నా స్నేహితులు అప్పగించిన కొన్ని పనులు చేసే నిమిత్తంతోనూ, కాస్త ఊరు చూద్దాం అన్న ఉబలాటంతోనూ మరో రెండు రోజులు మకాం వేశాను.

అప్పటికి బొంబాయి జనాభా దాదాపు డెబ్భై లక్షలు. బొంబాయి ఉత్తరం నుంచి దక్షిణంగా సముద్రంలోకి చొచ్చుకుపోయే ద్వీపాల సమూహం. గుజరాత్ నుంచి వచ్చే పశ్చిమ రైల్వే రైళ్ళన్నీ 'బోంబే సెంట్రల్' స్టేషనులో గమ్యం చేరుకొంటాయి. బొంబాయి దూరపు పొలిమేరలు 'వీరార్' వగైరా స్టేషన్ల నుంచీ, కాస్త దగ్గరగా ఉన్న 'బోరివిల్లీ' నుంచి స్థానిక ఎలక్ట్రిక్ ట్రైన్లు అంటే 'లోకల్స్', నగర వ్యాపార కేంద్రంలో ఉన్న 'చర్చిగేట్'లో గమ్యం చేరుకొంటాయి.

యిటు దేశ మధ్యస్థం నుంచీ, తూర్పు దిశ నుంచీ వచ్చిన మధ్య రైల్వే రైళ్ళు కళ్యాణ్ దగ్గర వంపు తిరిగి, దక్షిణంగా ప్రయాణం చేసి 'విక్టోరియా టెర్మినస్' (ఇప్పుడు 'ఛత్రపతి శివాజీ టెర్మినస్ – సి.యస్.టి.)లో ఆగిపోతాయి. లోకల్స్ కళ్యాణ్ నుంచి, యితర దూరపు పొలిమేరల నుంచి పయనించి 'వి.టి' చేరుకొంటాయి.

పశ్చిమ, మధ్య రైల్వేల నడవల్లో నాలుగేసి లైన్లు. దూరపు ప్రాంతాల రైళ్ళకి ఎగువ, దిగువ మార్గాల కోసం రెండు ఎగువ, దిగువ లోకల్స్‌కి రెండు. మధ్య రైల్వేలో వి.టి. నుంచి 'మాన్‌కుర్ద్' వరకూ 'హార్బర్ లైన్' అని మరొహటుంది, ఎగువ, దిగువ లోకల్స్ కోసం. హార్బర్ లైను నుంచి ముఖ్య మధ్య రైల్వేకి, పశ్చిమ రైల్వేకి జంక్షన్ స్టేషనున్నాయి.

పశ్చిమ రైల్వే శాంతాక్రుజ్ స్టేషన్లో లోకల్ ఎక్కి గ్రాంట్ రోడ్డులో ఉన్న నా స్నేహితుడి తల్లిదండ్రుల్ని చూసి వాళ్ళకో ఉత్తరం యివ్వడం, వాళ్ళేదైనా యిస్తే అస్సాం తీసుకువెళ్ళి వాళ్ళ కుర్రాడికి యివ్వడం ఓ పని. శాంతాక్రుజ్‌లో ఉన్న మా కంపెనీ 'గెస్ట్ హవుస్' నుంచి ఓ అయిదు నిముషాలు నడిచి, స్టేషన్ చేరుకొని, రెండో నంబరు ప్లాటుఫారం మీదకు చేరాను. సమయం ఉదయం తొమ్మిది గంటలు.

ప్లాట్‌ఫారం చేరిన నిముషంలో లోకల్ ట్రైన్ వచ్చింది. జనం క్రిక్కిరిసి ఉన్నారు. దిగే జనం తక్కువ. ఎక్కే జనం ఎక్కువ. ట్రైన్ ఎక్కడానికి ధైర్యం చాల్లేకపోయింది. ఆ ట్రైన్ పావు నిముషం కన్నా తక్కువ వ్యవధిలో కదిలి వెళ్లిపోయింది. అయిదు నిముషాల్లో మరో లోకల్ వచ్చింది. అదీ అంతే. ముందుకు వెళ్ళబోయి వెనకడుగు వేశాను. ట్రైన్ కదిలి వెళ్ళిపోయింది.

అక్కడే ఉన్న టీ స్టాల్ అతను నన్ను చూసి నవ్వుతూ అన్నాడు :


"మీరు బొంబాయికి కొత్తనుకుంటాను. మీరు ఖాళీ చూసుకొని ఎక్కాలంటే పన్నెండు దాటాల్సిందే! బండి రాగానే గుమ్మం దగ్గరకు పరుగెడితే వెనకున్న వాళ్ళే మిమ్మల్ని లోపలికి తోస్తారు! ఈ మారు ప్రయత్నించండి".

అన్నంతలోనే మరో ట్రైన్ వచ్చింది. ధైర్యం చేసి ముందుకు చొచ్చుకుపోయాను. లోపలికి ఎలా ప్రవేశించానో నాకే తెలియదు. సీట్ల వైపు వెడ్దామని ప్రయత్నించి విఫలుణ్ణై గేటు దగ్గర నడవలోనే పైనున్న రికాబ్ హుక్‌ని పట్టుకొని నిల్చున్నాను. స్టేషన్లు వస్తున్నాయి. వెడుతున్నాయి. జనాలు దిగుతున్నారు. ఎక్కుతున్నారు. మరింతగా నొక్కుకుపోతున్నాను. ఊపిరి సలపటల్లేదు.

అంతలోకి 'దాదర్' స్టేషను వచ్చింది. బండిలోంచి బయటకు ఒక వెల్లువలా జనం దిగారు. పైనున్న హుక్‌ని ఎంత బలంగా పట్టుకొన్నానో నాకే తెలియదు. లేకపోతే ప్లాట్‌ఫారం మీద పడేవాణ్ణి. ఒక్క క్షణం ఊపిరాడి 'అమ్మయ్య!' అనుకొన్నాను కాని, మరో వెల్లువలా జనం లోపలికి బిలబిలమంటూ ప్రవేశించడంతో యిదివరకటి కంటే మహా ఘోరంగా నొక్కుకు పోయాను. బస్ రూట్ తెలుసుకొని వెళ్ళుంటే బాగుండేదని లక్షమార్లు తిట్టుకొన్నాను.

గ్రాంట్ రోడ్ ఎప్పుడు వస్తుందో తెలియదు. ప్లాట్‌ఫారం ఎటువైపు వస్తుందో తెలియదు. నగరాల్లో దార్లడగడంలో సిగ్గు పడకూడదు. ఒకటికి రెండు సార్లు అడిగి తెలుసుకోకపోతే, గమ్యానికి దూరంగా పోయే అవకాశాలు మహానగరాల్లో చాలా ఎక్కువ. పక్కనున్న ఆసామీని అడిగాను.

"ఆ గేటు వైపు జరుగు. గ్రాంట్ రోడ్ ప్లాట్‌ఫారం అటువైపు వస్తుంది. వచ్చేది బొంబే



TOUCH & GO: A typical stretch near Govandi station on the harbour line sees men and trains nearly brushing each other on the tracks

సెంట్రల్. ఆపైది గ్రాంట్‌రోడ్" అన్నాడతను.

తోసుకుంటూ అటువైపు జరిగి, గ్రాంట్ రోడ్ రాగానే దిగాను.

హాయిగా ఊపిరి పీల్చుకుని టైమెంతో చూద్దామని ఎడం చెయ్యి ముందుకు పెట్టాను. రిస్ట్‌వాచ్ మాయం! చొక్కా జేబులో పెట్టుకున్నవి కూడా మాయం. లోపలగా టికెట్ మట్టుకు భద్రంగా ఉంది. గుడ్డి కన్నా మెల్ల నయం అనుకొన్నాను. చొక్కా చేతి మడతని తడిమాను. లోపల దాచిన వంద నోటు క్షేమం. ఆంధ్రా యూనివర్సిటీ అలవాటు మంచిదే అనిపించింది.

కవరు పోయినా, అడ్రసు జ్ఞాపకం ఉండడం మూలాన నాలుగైదు చోట్ల వాకబు చేసి ఓ యిరవై నిముషాల్లో వాళ్ళ యిల్లు చేరుకొన్నాను. ఏడంతస్తుల భవనంలో నాలుగో అంతస్తులో ఉన్న ఆరు ఫ్లాట్లలోనూ ఒకటి. రెండు చిన్న గదులూ, కిచెన్, బాత్‌రూం కమ్ టాయ్‌లెట్.

దేశ్‌ముఖ్ దంపతులు నన్ను సాదరంగా ఆహ్వానించారు. నేను వస్తున్నానని వాళ్ళకి ఉత్తరం అందిందట. ట్రైన్‌లో జరిగిన అనుభవం చెప్పి, ఉత్తరం పోయినందుకు 'సారీ' చెప్పుకున్నాను. నా వాచి పోయినందుకు విచారం వ్యక్తం చేశారు.

దేశ్‌ముఖ్ బట్టల మిల్లులో సూపర్‌వైజర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. నా స్నేహితుడు బాజీరావ్ దేశ్‌ముఖ్ మూడోవాడు. పెద్ద కొడుకులిద్దరూ, కోడళ్ళిద్దరూ బొంబాయిలోనే ఏవో కంపెనీల్లో పన్జేస్తున్నారు. పెద్దవాడి కూతురూ, రెండోవాడి కొడుకూ స్కూళ్ళలో చదువుకుంటున్నారు. అంటే ఆ రెండు గదుల్లోనూ మొత్తం ఎనమండుగురు నివసిస్తున్నారు. అందులో మూడు జంటలు!

"అందరూ ఆఫీసలకీ, స్కూళ్ళకీ వెళ్ళిపోయారు. భోజనం సిద్ధంగా ఉంది. నీ కోసమే ఎదురుచూస్తున్నాం" అంది బాజీరావ్ తల్లి.

వాళ్ళ అబ్బాయి బాగోగులూ, అస్సాం విశేషాలు చెబ్తూ వాళ్ళతో పాటు భోజనం ముగించాను.

ఆయన సహాయంతో ఒకరిద్దరు అడిగిన వస్తువుల్ని దగ్గర్లోనే మార్కెట్లో కొన్నాను. దేశ్‌ముఖ్ దంపతులు కాస్త మొహమాట పడుతూ, వాళ్ళ అబ్బాయి కోసమని రెండు సీసాలలో మహారాష్ట్ర ఊరగాయలూ, నిలవుండే పూరణ్ పోలీల (బొబ్బట్లు) పాకెట్టూ, ఓ గ్లాక్సో పాలడబ్బాలో ఏవో మిఠాయిలూ యిచ్చారు. అన్నీ కలిపి ఓ పెద్ద సంచీలో పెట్టారు. ఆయన నన్ను బస్ స్టాప్‌కి తీసుకువెళ్ళి, ఓ నెంబరు బస్సెక్కించారు.

"ఈ బస్సు శాంతాక్రూజ్ రైల్వేస్టేషన్ దగ్గర ఆగిపోతుంది. అక్కణ్ణించి మీ గెస్ట్‌హౌస్‌కి దారి తెలుసుగా" అంటూ వీడ్కోలు చెప్పారు.

ఆ సాయంత్రం మళ్ళీ రైలెక్కి బొంబాయి చూద్దామన్న ఉత్సాహం నాలో చచ్చిపోయింది. ఆ రోజు, మర్నాడుదయమూ ఏవో దగ్గర్లో ఉన్న బీచ్ అవీ చూసి, బేల్ పూరీలు తిని, కలకత్తా వెళ్ళే రైలెక్కి అస్సాం తిరుగు ప్రయాణం పట్టాను.

పాతిక సంవత్సరాల తర్వాత అంటే 1990లో, దేశంలో చాలా ప్రాంతాలలో పన్జేసిన తర్వాత బొంబాయి బదిలీ మీద వచ్చి, ఇప్పటికి దాదాపుగా ఎనిమిది సంవత్సరాలుగా బొంబాయిలో వుంటున్నాను.

యిప్పటి పరిస్థితి - అంటే (1999)లో - ఏమిటంటే -


హార్బర్ లైన్‌ని, థానా సముద్ర పాయ మీద వంతెన కట్టి, మాన్‌కుర్ద్ నుంచి న్యూ బొంబాయిలోని బేలాపూర్ వరకూ పొడిగించారు. దాన్ని బొంబాయి - పూనా మార్గంలో ఉన్న 'పాన్‌వెల్' వరకూ పొడిగించే ప్రయత్నంలో ఉన్నారు. (అది ఇటీవలే పొడిగించబడింది).

పశ్చిమ మధ్య రైల్వే స్టేషన్లన్నింటికీ దగ్గరగా, దూరంగా, అనేకానేకమైన సొసైటీలు వెలిసి, లక్కపిడతల్లాంటి గదులతో అసంఖ్యాకమైన ఆకాశ హార్మ్యాలు కుక్కగొడుగుల్లా లేచాయి. ఈ కొత్త ప్రాంతాలకి నీటి సదుపాయం కూడా సరిగా లేదు. కళ్యాణ్ దాటి, అంబర్‌నాథ్, ఉల్లాస్ నగర్‌ల వరకూ లెక్క లేనన్ని గృహ నిర్మాణాలు జరిగాయి. ఫలితంగా ప్రతి స్టేషన్‌కీ ప్రయాణీకుల రద్దీ పెరిగింది.

యిప్పుడు 'ముంబయ్' మహానగరం జనాభా దాదాపు ఒక కోటీ నలభై లక్షలు. వారానికి రెండు వేలకు పైగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పొట్ట చేత్తో పట్టుకొని ప్రజలు వలస వస్తున్నారు. వాళ్ళు నిలువ నీడ లేక, ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ గుడ్డలతో కాస్త గూడు కట్టుకుని నివసిస్తున్నారు. రైల్వే లైన్ల కిరుపక్కలా రైల్వే స్థలాల నాక్రమించుకుని, అత్యంత హేయమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారు. వాళ్ళని కదల్చడం ఎవరికీ సాధ్యం కాని పని. రాజకీయ నాయకులు వాళ్ళకి గొడుగు పడ్తారు. అధోజగత్ వాళ్ళకి రక్షణ కవచం.

ఫలితంగా పశ్చిమ, మధ్య రైల్వే నడవల్లో అప్పుడూ, యిప్పుడూ నాలుగేసే లైన్లున్నాయి. ఎలక్ట్రానిక్ సిగ్నల్స్ వ్యవస్థని అభివృద్ధి చేశారు. లెవెల్ క్రాసింగులు దగ్గర ఓవర్ బ్రిడ్జిలు కట్టారు. ట్రైన్ల సంఖ్య హెచ్చించారు. అయినా ఫలితం శూన్యం. ఎందుకంటే -

ప్రస్తుతం ప్రతి దినం బొంబాయి నగరంలో ఏభై నాలుగు లక్షల మంది లోకల్ ట్రైన్లలో ప్రయాణం చేస్తారు. లైన్ల కిరువైపులా చెయ్యందే దూరంలో నివసిస్తున్న లక్షలాది ప్రజల మూలాన, రైళ్ళ వేగం పడిపోయింది. బొంబాయి మహానగర పౌరుడు సగటున మూడు గంటలకు పైగా ప్రతి నిత్యం ప్రయాణం చేయవలసి వస్తోంది.



Western railway commuters cling onto a local on their way home after a hard day's work

బస్సుల్లో కానీండి, రైళ్ళలో కానీండి - యించుమించు యిదే పరిస్థితి దేశంలోని అన్ని నగరాల్లోనూ ఉంది. రాష్ట్రాల లోపల, రాష్ట్రాల మధ్య రైళ్ళ సంఖ్యని పెంచినా, ప్రయాణీకుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది.

ఇందుకు బాధ్యత జాతీయ రైల్వేలదా? దేశ ప్రజలదా? జాతి, మత, కుల, వర్గ విచక్షణలకి తావీయకుండా, ఒక్క క్షణం నిశితంగా ఆలోచించండి.

కాస్త కటువుగానే చెప్పవలసి వస్తోంది. కాళ్ళ మధ్యకు వెళ్ళే ముందు కాస్తంత జాగ్రత్త పడితేనే కాని, రైళ్ళలోనే కాదు, భూమ్మీద కూడా కాళ్ళాన్చి నిలుచోడానికి రేపు జాగా దొరకదు! ఇది ఖచ్చితంగా ప్రజల బాధ్యతే!

**పిట్ట కథ :**

కలకత్తా 'చౌరంగీ'లో ఏవో అవీ ఇవీ కొన్న తర్వాత 'నాక్‌తలా'లో ఉన్న మా యిళ్ళకి వెళ్ళే ప్రయత్నంలో సిటీబస్ ఎక్కాం, నేనూ స్నేహితుడు వీరేంద్ర సూదూ. విపరీతమైన రద్దీగా ఉంది బస్సు. గంట తర్వాత నేతాజీ సుభాస్ చంద్రబోస్ రోడ్‌లో మేం దిగవలసిన బస్‌స్టాప్‌లో దిగాం. దిగింతర్వాత చూసుకుంటే సూద్ షోల్డర్ బాగ్ కోసేసి ఉంది. అందులో ఉంచిన అతని మనీపర్సు, రెండు వందల డబ్బుతో సహా పోయింది.

నేను నా చొక్కా చేతి మడత తడుముకొన్నాను. మడతలో దాచుకొన్న నోట్లు సురక్షితంగానే ఉన్నాయి. హిప్‌పోకెట్‌ని తడుముకొన్నాను. చౌరంగీ పేవ్‌మెంట్ మీద పదిహేను రూపాయలు పెట్టి కొన్న హాంగ్ కాంగ్ సరుకు - రంగురంగుల నిరోధ్‌ల పాకెట్ - ఎవడో చెక్కేసాడు! నా కప్పుడనిపించిన మాట సూద్‌తో అన్నాను.

"పర్సుల్లో నిరోధ్‌లుంచుకుంటే, జేబు కొట్టేసిన వాడికీ, తద్వారా దేశానికీ ఏదో ఉడతాభక్తిగా సేవ చేసినవాళ్ళమవుతాం!"

అంత విచారంలోనూ సూద్ నవ్వలేకుండా వుండలేకపోయాడు.